క్లుప్తంగా

3 నుంచి గేసుదరాజ్ ఉరుసు

కడప కల్చరల్ : కడప నగరం అల్మాస్‌పేటలోని గేసుదరాజ్ బందానవాజ్ దర్గా షరీఫ్ ఉరుసు ఉత్సవాలు జూన్ 3 నుంచి 5వ తేది వరకు నిర్వహించనున్నట్లు పెద్దదర్గా ముజావర్ అమీర్ తెలిపారు. ఆస్తానె మగ్దూమ్ ఇలాహి అమీన్‌పీర్ సజ్జాద నషీన్ హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 3వ తేది గంధం, 4న ఉరుసు, 5న తహలీల్ ఫాతెహా నిర్వహిస్తారన్నారు. పెద్దదర్గా పీఠాధిపతి స్వగృహం నుంచి ఊరేగింపుగా గంధాన్ని తెచ్చి గురువుల మజార్ వద్ద సమర్పించి ఫాతెహా నిర్వహిస్తారన్నారు. ఉరుసు రోజున రాత్రి 10 గంటలకు ప్రముఖ ఖవ్వాలీ గాయకుల కచేరి ఉంటుందన్నారు.

విద్యుత్ అంతరాయానికి అడ్డుకట్ట వేయాలి

కడప రూరల్: కడప నగరంలో విద్యుత్ అంతరాయానికి అడ్డుకట్ట వేయాలని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ కోరారు. మంగళవారం స్థానిక ఏపీఎస్పీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షేక్ చాంద్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి కాలం అయినందున విద్యుత్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

2న కౌలు రైతుల జిల్లా సమావేశం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని సీపీఐ కార్యాలయంలో జూన్ 2న కౌలు రైతుల జిల్లా సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా బ్యాంకులో రుణాలను మంజూరు చేయాలన్నారు. అలాగే రైతు భరోసాను అందించి ప్రతి ఒక్కరికి కౌలు కార్డును మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశానికి కౌలుదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటమయ్య, హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని కౌలు రైతులు జిల్లా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

పెండ్లిమర్రి : మండలంలోని రేపల్లె గ్రామానికి చెందిన చావలి రవి, పుల్లీర్పు ఆనంద్‌లు రాయచోటి వద్ద పెట్రోల్ ట్యాంక్‌లో పడి ప్రమాదవశాత్తు మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులకు మంగళవారం ఎంపీడీఓ అల్తాఫ్ హుస్సేన్, అధికారులు తక్షణ సాయంగా వైఎస్సార్ బీమా కింద ఒక్కొక్క కుటుంబానికి రూ.10వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ రామాంజనేయరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగమల్లారెడ్డి, సాంబశివుడు, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, వెల్ఫేర్ అసిస్టెంట్ జయలక్ష్మి పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : తమకు కూడా ఇతర సచివాలయ ఉద్యోగులవల్లే పనివేళలను అమలు చేయాలని వార్డు శానిటేషన్-ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు కోరారు. మంగళవారం వారు కడప నగరపాలక సంస్థ అడిషనల్ మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి వినతిపత్రమిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వార్డు శానిటేషన్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీల అసోసియేషన్ గౌరవ ధ్యక్షులు శ్రీ గుజ్జుల ఈశ్వరయ్య గారి పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. తమను కూడా సచివాలయ ఉద్యోగుల్లాగా గుర్తించాలని, ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు సమయపాలన అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కడప నగరపాలక సంస్థలో పని చేస్తున్న అందరు వార్డు శానిటేషన్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు పాల్గొన్నారు.

దోష నివారణ పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూల మూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.ఆలయ నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిద్దాం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం నగరంలోని కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్య పోరాటాల ద్వారానే కార్మికుల ప్రయోజనాలను కాపాడగలమన్నారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్, రైల్వే, ఎల్ఐసీ వంటి సంస్థను ప్రైవేటీకరణ చేయడాన్ని సిఐటియు వ్యతిరేకించిందన్నారు. సిఐటియు నాయకులు మనోహర్, లక్ష్మీదేవి, చంద్రారెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.

మేనిఫెస్టోను పక్కాగా అమలు చేశాం

- ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా
- వైఎస్సార్ సీపీ పాలన నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సంబరాలు
- వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం, అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న డిప్యూటీ సీఎం, మేయర్ తదితరులు

కడప కార్పొరేషన్: మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి.... పక్కాగా అమలు చేసి అసలైన నిర్వచనం చెప్పిన పార్టీ వైఎస్సార్‌సీపీయేనని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కడపలోని హెడ్‌పోస్టాఫీసు ఎదుట ఉన్న దివంగత వైఎస్సార్ విగ్రహానికి మేయర్ సురేష్ బాబుతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించి, పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఈ నాలుగేళ్లలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతులు విత్తు వేసేటప్పటి నుంచి గిట్టుబాటు ధర వరకూ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. వెయ్యి రూపాయలు దాటిన ప్రతి వైద్యాన్ని ఆరోగ్య శ్రీలోకి చేర్చారని, 3450 వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చారన్నారు. రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు తెచ్చారని, గ్రామీణ ప్రజానీకం ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని «ఫ్యామిలీ డాక్టర్» విధానాన్ని తీసుకొచ్చారని తెలిపారు. గత ప్రభుత్వాలు ప్రభుత్వ బడులను నిర్వీర్యం చేశారని, ప్రస్తుత ప్రభుత్వం యువతకు చదువే ఆస్తిగా భావించి, ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు కింద అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తోందన్నారు. పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థి మొదటి స్థానంలో నిలవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98.5 శాతం అమలు చేసి, రెండు లక్షలా పదిహేనువేల కోట్లను డీబీటీ ద్వారా ప్రజల ఖాతాల్లో జమ చేశామన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సువర్ణపాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదిస్తున్నారన్నారు. తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదలకు నగదు పంచుతుంటే ...రాష్ట్రం దివాళా తీసింది... మరో శ్రీలంక అవుతుందని ఈర్ష్య పడిన చంద్రబాబు, తమ పథకాలను కాపీకొడుతూ మేనిఫెస్టో ప్రకటించడం దారుణమన్నారు. 2014లోని ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయకుండా దాచిపెట్టిన చంద్రబాబు, ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే మళ్లీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, పార్టీ నాయకులు జయచంద్రారెడ్డి, ఐస్‌క్రీం రవి, శ్రీరంజన్‌రెడ్డి, బాలస్వామిరెడ్డి, షఫీ, పవర్ అల్తాఫ్, సీహెచ్ వినోద్, తోటక్రిష్ణ, దాసరి శివప్రసాద్, సుబ్బారెడ్డి, రమణ, పస్తం అంజి, పత్తిరాజేశ్వరి, వెంకట సుబ్బమ్మ, రత్నకుమారి, సుశీలమ్మ, తులశమ్మ పాల్గొన్నారు.

మహానాడు కాదది మాయనాడు:
-ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



తెలుగుదేశం పార్టీ ఇటీవల నిర్వహించింది మహానాడు కాదని, మాయనాడు అని మైదుకూరు శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబులతో కలిసి ఆయన కేక్ కట్ చేసి, ఒకరినొకరు తినిపించుకున్నారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన ఈ రోజు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. మహానాడులో చంద్రబాబు అమలుకు అలివిగాని హామీలిచ్చారని, ఆ హామీలు అమలు చేయాలంటే నాలుగు లక్షల కోట్ల ఆదాయం ఉంటే తప్పా అమలు చేయడం సాధ్యం కాదన్నారు. 18-59 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1500 ఇవ్వడం, రైతులకు రూ.20వేలు ఇవ్వాలంటే రాష్ట్ర బడ్జెట్ సరిపోదన్నారు. మేనిఫెస్టోను ఎవరు సక్రమంగా అమలు చేశారో, ఎవరు చేయలేదో ప్రజలవద్దకే వెళ్దామని సవాల్ విసిరారు.

టీడీపీది కాపీ మేనిఫెస్టో: మేయర్



పక్క రాష్ట్రాల్లో అమలవుతున్న హామీలను కాపీ కొట్టి టీడీపీ మేనిఫెస్టో తయారు చేశారని కడప మేయర్ కె. సురేష్ బాబు ఎద్దేవా చేశారు. తమిళనాడును చూసి గ్యాస్ సిలిండర్లు, కర్నాటకను చూసి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం హామీలిచ్చారన్నారు. తాము ప్రవేశపెట్టిన అమ్మ ఒడి పథకాన్ని కూడా కాపీ చేశారని తెలిపారు. ఏ ప్రభుత్వమైనా ఎన్నికల హామీల్లో కొన్నింటినే అమలు చేస్తుందని, అన్నీ అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు.

టీడీపీది మోసపూరిత మేనిఫెస్టో

కడప కార్పొరేషన్: మహానాడులో చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో మోసపూరితంగా ఉందని వైఎస్సార్‌సీపీ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి ఎంకే రత్నకుమారి అన్నారు. మంగళవారం ఆమె కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజల ఖాతాల్లో నగదు జమ చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వారిని సోమరిపోతులను చేస్తోందని విమర్శించిన చంద్రబాబు, ఇప్పుడు తమ పథకాలనే కాపీ కొడుతున్నాడన్నారు. 14 ఏళ్ల సీఎంగా ఉన్న చంద్రబాబు ఒక్క సారైనా ఎన్నికల మేనిఫెస్టోను సక్రమంగా అమలు చేశారా అని ప్రశ్నించారు. టీడీపీ పాలనలో సుజనా చౌదరి, సీఎం రమేష్, ఏబీఎన్ రాధాక్రిష్ణలకు మాత్రమే లబ్ధి చేకూరిందని విమర్శించారు. ఎన్ని మోసపూరిత హామీలిచ్చినా టీడీపీకి అధికారం రాదన్నారు.

హజ్ యాత్రికులపై దాడి దారుణం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాజస్థాన్ రాష్ట్రంలోని కోట జిల్లా కేంద్రంలో హజ్ యాత్రికులపై దాడి జరగడం దారుణమని ఏపీ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు మహ్మద్ అలీఖాన్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. హజ్‌యాత్రకు బయలుదేరిన ముస్లిం యాత్రికులపై పాశవికంగా దాడి చేసిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, భజరంగ్‌దళ్ వెంటనే నిషేధించాలన్నారు. ఈ ఏడాది చివర్లో రాజస్థాన్‌లో ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా హిందూ, ముస్లింల మధ్య చిచ్చు పెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ఇలాంటి దాడులను మోదీ ప్రభుత్వం చేయిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు ప్రసాద్ గౌడ్, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

భూ మాఫియాను అరికట్టాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలో భూ మాఫియాను అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అర్హులైన పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వడానికి, రెండు ఎకరాల సాగు భూమి ఇవ్వడానికి నిరాకరిస్తున్న అధికారులు విలువైన ప్రభుత్వ భూములు అక్రమించి తప్పుడు పత్రాలను సృష్టించి అమ్ముతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అసైన్‌మెంట్ కమిటీ సమావేశాలు విధిగా నిర్వహించి ఎమ్మెల్యే నేతృత్వంలో ఆర్‌డిఓ, ఎమ్మార్వో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో సమావేశాలు నిర్వహించి అర్హుల పేదలకు రెండు ఎకరాల సాగు భూమిని పంపిణీ చేశారని గుర్తు చేశారు. సీపీఐ నాయకులు వెంకటశివ, కెసీ బాదుల్లా, మస్తాన్ పాల్గొన్నారు.

రెజ్లర్లపై దాడి సరికాదు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: దేశ రాజధాని ఢిల్లీలో రెజ్లర్లపై పోలీసులు దాడులు చేసి అక్రమ కేసులు పెట్టడం దారుణమని ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాషా పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని శాంతియుతంగా ఉద్యమాలు చేస్తుంటే వారిపై పోలీసులు దాడులు చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. దేశానికి పతకాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలో మన దేశ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప చేసిన రెజ్లర్లపై పోలీసులతో నిర్బంధ కాండ విధించడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు.

రేపు శ్రీపెనుశిల లక్ష్మీనరసింహుని కల్యాణం

కడప కల్చరల్ : కడప నగరం ఆలంఖాన్‌పల్లెలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో స్వామి జయంతి సందర్భంగా గురువారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నామని కార్యనిర్వాహకులు రేవిళ్ల సురేష్‌బాబు తెలిపారు. ఉత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు స్వామి మూల మూర్తికి అభిషేకం, అనంతరం అలంకారం, అర్చన హారతి నిర్వహిస్తామన్నారు. ఉదయం 9. నుంచి కల్యాణోత్సవం ప్రారంభమవుతుందని, 12 గంటలకు అన్నప్రసాద వితరణ ఉంటుందని వివరించారు.

ఎన్‌సీసీ, ఎన్‌వైసీ కేంద్రాల పరిశీలన



నెహ్రూ యువకేంద్ర యూత్ హాస్టల్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగరంలోని నేషనల్ కేడెట్ కార్పొరేషన్ (ఎన్‌సీసీ), నెహ్రూ యువకేంద్రాలను మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ మంగళవారం పరిశీలించారు. ఎన్‌సీసీ క్యాంపులో డ్రైన్‌క్లీనింగ్ చేయాలని, గ్యాంగ్ వర్క్‌ద్వారా ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించాలన్నారు. జిమ్‌లో పలు మార్పులు చేయాలని సూచించారు. నెహ్రూ యువ కేంద్ర కాంపౌండ్ వాల్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, విద్యార్థులు చదువుకునేందుకు క్యాబిన్ ఏర్పాటు చేయాలన్నారు. మీటింగ్ రూమ్‌ను ఆధునికీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక నాయకుల ఆందోళన

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో కార్మికులను ఇతర వార్డులకు పంపాలంటే ఒక విధి విధానం అంటూ లేకుండా పోయిందని సీఐటీయూ నాయకులు శ్రీనివాసులరెడ్డి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నగర అధ్యక్షుడు ఎస్. రవి అన్నారు. మంగళవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదుట వారు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ శానిటేషన్ సెక్రటరీలు కమిషనర్ పేరు చెప్పి బెదిరింపు ధోరణితో కార్మికులను ఇతర వార్డులకు పంపుతున్నారన్నారు. 15-20 ఏళ్లుగా ఎలాంటి రిమార్క్ లేకుండా పనిచేస్తున్న వారిని ఇతర వార్డుల్లో పనిచేయాలని చెప్పడం సరికాదన్నారు. ఏదైనా తప్పు చేసి ఉంటే, నిజానిజాలు తెలుసుకొని మార్చాలి తప్పా అధికారం ఉందని మార్చడం సరికాదన్నారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా వ్యవహరిస్తున్న ముగ్గురు సెక్రటరీలు కార్మికులను వేధిస్తున్నారన్నారు. మహిళా కార్మికులు ధరణి, పెంచలమ్మ, పెద్దమ్మ, కొండమ్మ, సాయమ్మ, నాయకులు తిరుపాల్, శ్రీరామ్, శ్రీధర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీని దించడానికి ప్రజా ఉద్యమం చేపట్టాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని మోదీ కాషాయ కూటమిని దించడానికి ప్రజా ఉద్యమం చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని యూటీఎఫ్ భవనంలో సీపీఎం నగర కమిటీ శిక్షణ తరగతులను రెండవ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ సంఘ్ పరివార్ శక్తులు, కాషాయ కూటమిని ఢిల్లీ పీఠం నుంచి దించడానికి ప్రజా ఉద్యమం చేపట్టాలన్నారు. దేశంలోని అడవుల్లో విలువైన ఖనిజ సంపదను స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి గిరిజన గూడెలను బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారని తెలిపారు. 2024 ఎన్నికల్లో బిజెపి కూటమికి సహకరించే పార్టీలను దేశంలో ఓడించాల్సిన భాధ్యత ప్రజలపై ఉందన్నారు. సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, ఓబులేసు, ఫరూక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చే విధంగా పరిపాలన

- అనేక సంక్షేమ పథకాల అమలు
- కేక్ కటింగ్‌లో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న మున్సిపల్ చైర్మన్ మార్పురి మేరి

కమలాపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలు మెచ్చే విధంగా పరిపాలన అందించారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కొనియాడారు. జగనన్న ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తి అయిన నేపథ్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే పార్టీ శ్రేణుల మధ్య భారీ కేక్ కట్ చేశారు. అభిమానులు, నాయకులు, కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనగన్న తాను చేసిన పాద యాత్రలో నేను విన్నాను..నేను ఉన్నాను..అని చెప్పిన జగనన్న ప్రజల సమస్యల పరిష్కారానికి నవరత్నాలతో కూడిన మెనిఫెస్టో విడుదల చేశారన్నారు. ఆ మెనిఫెస్టోను ఖురాన్‌గా, బైబిల్‌గా, భగవద్గీతగా భావించి అందులోని 99 శాతం హామీలు నెరవేర్చారన్నారు. చెప్పని హామీలు సైతం నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గతంలో ఎన్నో పార్టీలు విడుదల చేసిన మెనిఫెస్టోలు చూశాముగాని, అవి అధిక శాతం నెరవేర్చనివేనన్నారు. టీడీపీ నాయకుడు చంద్రబాబు 2014 ఎన్నికల్లో బూటకపు హామీలతో మెనిఫెస్టో విడుదల చేసి 2015లో ఆ వెబ్‌సైట్ నుంచి తొలగించాడన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన ప్రజలు మెచ్చుకునే విధంగా ఉండటంతో కాలర్ ఎగరేసుకుని ప్రజల్లోకి వెళ్తున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కులమతాలు, పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా జగనన్న అందిస్తున్నారని, పథకాలు అందిన వారంతో ఈ సంబరాలు జరుపుకోవాలని ఆయన కోరారు. ఎన్నికలు ఎపుడు వచ్చిన 175 సీట్లు గెలవడం ఖాయం అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మార్పురి మేరి, వైస్ చైర్మన్లు మహ్మద్‌సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, కొండారెడ్డి, పీవీ కృష్ణారెడ్డి, ఇర్ఫాన్, లక్ష్మీనారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి, మైసూరారెడ్డి, మస్తానయ్య, రామసుబ్బారెడ్డి, మర్రిసుబ్బన్న, విజయేంద్రారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగనన్న

కడప కార్పొరేషన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల సారథి అని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్. సుబ్బారెడ్డి, కడప మార్కెట్ యార్డు డైరెక్టర్ పి. సంపత్ కుమార్ అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం సాయంత్రం కడప వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట మహిళా నాయకురాలు చైతల్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. మార్కెట్‌యార్డు డైరెక్టర్లు గోపాలక్రిష్ణ, నాగేంద్ర(బుజ్జి), రామలక్ష్మి, సుశీలమ్మ, జయశ్రీ, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్, శ్యాంసన్ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి టి.కె. అఫ్జల్‌ఖాన్

కడప స్పోర్ట్స్: తాడిపత్రిలో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించిన 1వ రాయలసీమస్థాయి ఓపన్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో కడప నగర క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచారు. కడప నగరంలోని ఉర్దూ నగరపాలక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు ఆరు గురు పతకాలు సాధించినట్లు శిక్షకుడు జంషీర్ తెలిపారు. మంగళవారం కడప నగరంలో వీరిని వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి టి.కె. అఫ్జల్‌ఖాన్ అభినందించారు. సబ్‌జూనియర్ విభాగంలో ఎస్. అలకనంద స్వర్ణం, క్యాడెట్ విభాగంలో ఎస్. హలిమాసాదియ స్వర్ణం, ఎం. గంగామయి స్వర్ణపతకాలు సాధించారు. జూనియర్ విభాగంలో ఎస్. అఫ్జల్‌బాషా రజతం, సబ్‌జూనియర్స్‌లో ఎస్. దావూద్ కాంస్యం, కేడెట్ విభాగంలో ఎస్. అబ్దుల్ అహాద్ కాంస్యపతకం సాధించినట్లు శిక్షకుడు తెలిపారు. కోచ్ ఇర్ఫాన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ముగిసిన ఇస్లామిక్ వేసవి శిక్షణ శిబిరం

కడప కల్చరల్: స్థానిక రవీంద్రనగర్‌లోని మదరసా-ఏ-ఇర్ఫాన్ ఉల్ రషాద్‌లో లజ్‌నతుల్ ఉలేమా కమిటీ ఆధ్వర్యంలో ఇస్లామిక్ వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. పలువురు చిన్నారులు ఈ వేసవి సెలవుల్లో ఇందులో చేరి శిక్షణ పొందారు. సంస్థ కార్యదర్శి హజరత్ మౌలాన షేక్ మహమ్మద్ రషాది ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం శిక్షణ పొందిన చిన్నారుల ప్రతిభను పరిశీలించి ప్రశంసాపత్రాలు అందజేశారు. సర్టిఫికెట్లు అందుకున్న 92 మంది విద్యార్థులకు ప్రతిభను బట్టి నిర్వాహకులు బహుమతులు కూడా అందజేశారు. స్థానిక జన వికాస్ సేవా సమితి స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎండీ తాహీర్ బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు ధార్మిక విద్యను తప్పక నేర్పాలని సూచించారు. ఈ సందర్భంగా మదరసా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. కార్యక్రమంలో మదరసా ప్రతినిధులు కుతుబుద్దీన్, రసూల్‌ఖాన్, షావలీఖాన్, మదరసా శిక్షకులు మౌలాన సజ్జాద్ పాల్గొన్నారు.

గణితం గమ్మత్తయిన అంశం

కడప కల్చరల్: గణితం గమ్మత్తైన అంశమని గణిత శిక్షకులు టి.సుబ్రమణ్యం అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న విద్యార్థుల వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా 21వ రోజు ఆయన విద్యార్థులకు గణితంలో మెళుకువలను వివరించారు. చాలా మందికి గణితమంటే భయమని, ఇందులో సులభ పద్ధతులను నేర్చుకుంటే గణితంపై మక్కువ బాగా పెరుగుతుందన్నారు. గణితం నేర్చుకుంటే ఆలోచన శక్తి పెరుగుతుందని, భౌతిక, రసాయనిక శాస్త్రీలను అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రధానంగా గణితంలో ప్రత్యేకత సాధిస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. రోజువారి జీవితంలో ప్రతి అడుగున గణితం ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన బోర్డుపైన పలు లెక్కలు వేసి వాటిని సులభంగా చేయడాన్ని నేర్పారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్.అమీరుద్దీన్, డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలోని ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ అమరావతి నాయకులు మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీయూసీ నాయకుడు నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు దాచుకున్న డబ్బులను అవసరాలకు చెల్లించకపోవడం వల్ల పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 11వ పీఆర్సీలో పొందుపరిచిన క్యాడర్ వారి స్కేల్స్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. ఇప్పటికి చాలా శాఖల్లో ఉద్యోగులకు స్పెషల్ పేలు, అలవెన్సులు తేలలేదని పేర్కొన్నారు. అరియర్స్, పెండింగ్ డీఏలు చెల్లించాలని కోరారు. సంవత్సరం కిందట ఉద్యోగ విరమణ లేదా మరణించిన ఉద్యోగ ఉపాధ్యాయుల కుటుంబాలకు ప్రయోజనాలు అందజేయాలన్నారు. ప్రతినెల1వ తేది జీతాలు, పెన్షన్లు ఇవ్వాలని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. జేఏసీ వైస్ చైర్మన్ పురుషోత్తం, మహిళా నాయకురాలు అనూరాధ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ నాయకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. మూడేళ్ల మనుదీప్‌కు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు అవసరమైన రూ.17.50లక్షలను మంగళవారం సాయంత్రం ఆయన వారి తల్లిదండ్రులు బాలాజీ, వెంకటలక్ష్మిలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకాష్‌కు చెందిన వీరు నిరుపేదలని, ఆ జబ్బు నయం చేసుకునే స్తోమత వారికి లేదన్నారు. ఆపరేషన్‌కు అంత మొత్తం భరించలేమని తన వద్దకు వచ్చినపుడు, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి ఈ మొత్తాన్ని మంజూరు చేయించామన్నారు. అనంతరం బాలుడి తల్లిదండ్రులు బాలాజీ, వెంకటలక్ష్మి మాట్లాడుతూ మూడు రోజుల్లోనే ఆపరేషన్‌కు అయ్యే పూర్తి మొత్తాన్ని మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, సహకరించిన డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలకు కృతజ్ఞతలు తెలిపారు. సుబ్బారెడ్డి, రామమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

జీవీ ఫుట్‌బాల్ బాధితులకు న్యాయం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జీవీ ఫుట్‌బాల్ యాప్‌లో పెట్టుబడులు పెట్టి నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి ఓబులేసు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జీవీ ఫుట్‌బాల్ యాప్‌లో పెట్టుబడులు పెడితే అధిక ఆలాభాలు వస్తాయంటూ కొంతమంది ఏజెంట్లు ప్రచారం చేసి దాదాపు రూ. 50 కోట్లు పెట్టుబడులు పెట్టించుకొని కుంభకోనానికి పాల్పడ్డారని దీనిపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలన్నారు. డీవైఎఫ్‌ఐ నాయకులు విజయ్. జగదీష్ పాల్గొన్నారు.

పబ్లిక్ లీగల్ నోటీసు

వై.ఎస్.ఆర్. జిల్లా, వల్లూరు మండలం, అంబవరం గ్రామ నివాసి అయిన చెంచిరెడ్డిగారి ఓబుళరెడ్డి కుమారుడు ఓబుళరెడ్డి వారు యిచ్చిన సూచనల మేరకు జారీ చేయు పబ్లిక్ నోటీసు ఏమనగా!

నా క్లయింటు, బచ్చు సురేష్ బాబు, తండ్రి శేషయ్య, బద్వేల్ టౌన్ నివాసి వాది, పైన క్రింద షెడ్యూలు దాఖలా ఆస్తిని 03.11.2015న ఒక విక్రయ అగ్రిమెంట్ రీత్యా పూర్తి కొనుగోలు మొత్తం చెల్లించి అగ్రిమెంటును పొంది వున్నారు. షెడ్యూలు దాఖలా ఆస్తిని రిజిస్టరు కోరుచూ నా క్లయింట్ బచ్చు సురేష్ బాబు పైన రాజశ్రీ కడప 4వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో య.నం. 52/2022 రుగా వ్యాజ్యం దాఖలు చేసి I.A.No. 948/2022 రుగా ఇంజక్షన్ పిటీషను ఉత్తర్వుల కొరకు పెండింగులో 20.06.2023నకు వాయిదా వున్నది.

అయితే బచ్చు సురేష్ బాబు గారు షెడ్యూలు ఆస్తిపైన కోర్టులో వున్న కేసును దాచిపెట్టి ఇతరులకు ఆస్తిని విక్రయించి సొమ్ము చేసుకొనుటకు ప్రయత్నములు చేయుచున్నారు. దావా పెండింగులో వున్నందున సెక్షన్ 52 ఆస్తి బదలింపు చట్టం ప్రకారం ఏలాంటి లావదేవీలు జరపరాదు. ఒక వేళ కోర్టు వ్యాజ్యం ధిక్కరించి జరిపిన యెడల అట్టి లావదేవీలపైన వాటిని వ్రాసుకొన్న, వ్రాయించిన వ్యక్తులపైన చట్ట ప్రకారం సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకొనబడును. అందువలన ఎవరు కూడా షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఏలాంటి లావదేవీలు జరపరాదు.

షెడ్యూలు :

కడప జిల్లా, వల్లూరు మండలం, వల్లూరు రెవెన్యూ గ్రామం
సర్వే నెంబరు : 1275 లో ఏ. **2.31** సెంట్లు
సర్వే నెంబరు : 1287 లో ఏ. **2.30** సెంట్లు
సర్వే నెంబరు : 1288 లో ఏ. **2.43** సెంట్లు
సర్వే నెంబరు : 1288 లో ఏ. 3.00 సెంట్లు పైకి ఏ. **2.39** సెంట్లు.
మొత్తం విస్తీర్ణం : ఏ. 9.43 సెంట్లు.

సం/- **ఎం. సుధాకర్ బాబ్జీ,** అడ్వకేట్, కడప.